ప్రజాశక్తి

మంగళవారం 26 నవంబర్ 2024 | 5 | విజయనగరం



29 నుంచి జిల్లాలో వర్షాలు

రైతులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా ఈ నెల 29 నుంచి జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉందని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. వర్షాల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నందున, పంట తడిచిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించడంతోపాటు, అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. మరోవైపు తుపాను నేపథ్యంలో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పంట చేతికొస్తున్న సమయంలో తుపాను వస్తే నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.



రైతన్నకు 'వెన్ను'పోటు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రెల్ల రాల్లుపురుగుతో తీవ్ర నష్టం
దిగుబడిపై ప్రభావం

సరిగ్గా పంట చేతుకు అందుతున్న సమయంలో వరి రైతులకు వెన్నుపోటు తగులుతోంది. రెల్ల రాల్లు పురుగు రెచ్చిపోతోంది. సరిగ్గా వరి వెన్ను కింది భాగంలో కొరికేయడంతో పంట నేలపాలవుతోంది. ఈ విషయాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆ శాఖ అధికారులు ధ్రువీకరించారు. దీంతో, రైతుల్లో ఆందోళన మొదలైంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదం నుంచి బయట పడవచ్చని అధికారులు సూచనలు చేస్తున్నారు.

జిల్లాలో ఈ ఏడాది 2,45,533 ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో ఇప్పటి వరకు 50శాతం కోతలు పూర్తయ్యాయి. చీపురుపల్లి, మెరకముడిదాం, గరివిడి, తెర్లాం, వంగర, బొబ్బిలి, సంతకవిటి, గుర్ల, రేగిడి ఆమదాలవలస మండలాల్లో వరి కోతలు ఎక్కువగా జరిగాయి. పంట కోత ప్రయోగాలు ముమ్మరంగా సాగుతున్నాయి. వీటి ప్రకారం ఈ ఏడాది ఎకరాకు 2,317 కేజీల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు లెక్కకడుతున్నారు. దీన్నిబట్టి 75కేజీల బరువుగల బస్తాలు 31వరకు వస్తాయన్నమాట. ప్రయోగాలు పూర్తయ్యేనాటికి కనీసం 29బస్తాలు, అంటే గతం కన్నా ఒక బస్తా దిగుబడి అయినా పెరుగుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రెల్ల రాల్లు పురుగు రైతులను కలవర పాటుకు గురిచేస్తోంది. వర్షాధారంగా సాగేచేయడం వల్ల జిల్లాలో వరి నాట్లు కాస్త ముందు, వెనుక అయ్యాయి. ప్రస్తుతం ఓ వైపు ముమ్మరంగా కోతలు జరుగుతుండగా, కొన్ని చోట్ల పొట్టపాలు దశ, గింజ గట్టిపడే దశలో ఉన్నాయి. ఇంకొన్ని ప్రాంతాల్లో కోతకొచ్చే దశ వరకు ఉన్నాయి. గతంతో పోల్చిస్తే ఈ ఏడాది వరి పంట ముందస్తుగానే ఈ ఏడాది కోత దశకు వచ్చింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు బట్టి రెల్ల రాల్లుపురుగు వెన్ను కొరికి నష్టాన్ని కలుగజేస్తోంది. చాలాచోట్ల వరికంకులు రాలి పోతుండడంతోరైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

వాతావరణం అనుకూలించి ముందస్తుగానే పంట చేతకందుతుందన్న తరుణంలో ఇటువంటి విపత్తు రైతన్నను ఒకింత కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఈ తెగుళ్లతో నష్టపోయిన రైతులందరికీ ఆదుకోవా లని ఏపి రైతు సంఘం డిమాండ్ చేస్తూ ఇప్పటికే కలెక్టర్ బిఆర్ అంబేద్కర్కు లేఖ రాయడంతో పాటు, తాజాగా కలెక్టరేట్ వద్ద రైతులు ధర్నా చేపట్టారు.

ఇవీ నష్ట నివారణ చర్యలు

రెల్ల రాల్లుపురుగును బారి నుంచి వరి పంటను రక్షించుకునేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. వీటి ప్రకటనల ప్రకారం... 2.5 మిల్లీ లీటర్ల క్లోరోఫైరిఫాస్ మందును ఒక లీటరు నీటిలోని లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాముల పురుగుల మందును 200 లీటర్ల నీటిలో కలిపి చేసొస్తే చల్లడం ద్వారా పురుగు ఉధృతిని తగ్గించవచ్చు. ఎర పద్ధతిలో 5కేజీల తవుడు, అరకేజీ బెల్లంతో కలిపించి నీటిలో వేసి, చిన్నచిన్న ఉండలుగా తయారు చేయాలి. ఆ ఉండలను పొలంపొలాల్లో వెదజల్లడం ద్వారా రెల్ల పురుగులను నాశనం చేసేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా పంటను సంరక్షించుకోవచ్చు.

ఆర్టిసిని బలోపేతం చేస్తాం

- రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణ
- జోనల్ చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన దొన్నుదొర
- విజయనగరం నుంచి అరకు, పాడేరుకు త్వరలోనే బస్సు సర్వీసు : దొన్నుదొర



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్టిసి జోనల్ చైర్మన్ దొన్నుదొర

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర రవాణా సంస్థను మరింతగా బలోపేతం చేసి రాష్ట్రంలో ప్రజా రవాణాను, ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తామని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణ చెప్పారు. ప్రయాణీకులకు మరింత రక్షణ కల్పించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణం చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎపిఎస్ఆర్టిసి జోనల్ చైర్మన్గా అరకు ప్రాంతానికి చెందిన సియ్యారి దొన్నుదొర విజయనగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సులోని ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు నగరానికి చేరుకున్న సియ్యారి దొన్నుదొరకు సంస్థ అధికారులు, ఉద్యోగులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టిసి చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ ప్రయాణీకులతోపాటు సంస్థలోని ఉద్యోగుల కూడా ముఖ్యమని వారి సమస్యలు పరిష్కరించి ఉద్యోగులు, అధికారుల సహకారంతో మరింత మెరుగైన సేవలు అందించే ప్రయత్నం చేస్తామన్నారు.

అరకు మీదుగా పాడేరుకు నేరుగా బస్సు సౌకర్యం

విజయనగరం నుంచి అరకు మీదుగా జిల్లా కేంద్రం పాడేరుకు బస్సు సౌకర్యం కల్పిస్తామని జోనల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర చెప్పారు. ఈ ప్రాంతం నుంచి పర్యాటకులు, ఉద్యోగులు అరకు, పాడేరు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఈ బస్సు వల్ల ప్రయాణం సులభతరమవుతుందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. ఆర్టీసీ నష్టాలను తగ్గించేందుకు సంస్థ ఉద్యోగుల సహకారం తీసుకుంటామన్నారు. నాపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేకూర్చేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని జోనల్ చైర్మన్ చెప్పారు. అంతకుముందు సియ్యారి దొన్నుదొరతో చైర్మన్ కొనకళ్ల నారాయణ ప్రమాణం చేయించారు. అనంతరం దొన్నుదొర బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, ఇడి పి.విజయకుమార్, జిల్లా ప్రజారవాణా అధికారి సిహెచ్.అప్పల నారాయణ, పార్వతీపురం డిపిటిఒ కె.శ్రీనివాసరావు, అనకాపల్లి డిపిటిఒ కె.పద్మావతి, డిప్యూటీ సిఎంఒ పి.వి.నాగేశ్వరరావు, డిప్యూటీ సిటిఎం సుధాబిందు, ఆర్టీసీ అధికారులు వరలక్ష్మి, ఐ.లక్ష్మీకాంత్, బి.రాజశేఖర్, కె.అరుణ్ కుమార్, ఐ.దుర్గాప్రసాద్, మన్యం జిల్లా డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

కొత్త బస్సులు ప్రారంభించిన ఆర్టిసి చైర్మన్

శ్రీకాకుళం - విశాఖ మధ్య నాన్-స్టాప్ లుగా నడిపేందుకు రెండు అల్ట్రా డీలక్స్ బస్సులను, శ్రీకాకుళం - విజయనగరం మధ్య నడిపేందుకు ఉద్దేశించిన ఎక్స్ప్రెస్ సర్వీసును ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ కొనకళ్ల నారాయణ, జోనల్ చైర్మన్ దొన్నుదొర ప్రారంభించారు. అనంతరం డిపోలో వారు మొక్కలు నాటారు.

దోనుదొరకు జిసిసి చైర్మన్ శుభాకాంక్షలు

బాధ్యతలు చేపట్టిన దోనుదొరకు జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా శ్రావణ్ కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయనకు పుష్పగుచుం అందించి సాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన మాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముకానీయకుండా శక్తివంతం లేకుండా ఆర్టిసి,. జిసిసి లభివృద్ధికి ఇరువురం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

పిజిఆర్ఎస్కు జిల్లా అధికారులే హాజరు కావాలి

వినతుల పరిష్కారంలో చిత్తశుద్ధి చూపాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజా వినతుల పరిష్కార వేదిక స్వీకరణ కార్యక్రమానికి ప్రతి సోమవారం జిల్లా అధికారులే హాజరు కావాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అధికారులకు ఆదేశించారు. రెండు జిల్లాల ఇంఛార్జులుగా వ్యవహరిస్తున్న అధికారులు ఒక వారం విజయనగరం , మరొక వారం రెండవ జిల్లాకు హాజరు కావాలని సూచించారు. కలెక్టర్ అనుమతి లేనిదే పిజిఆర్ఎస్ కు గైర్హాజరు కాకూడదని, అలంటి వారి పై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సెలవులకు కూడా కలెక్టర్ అనుమతి తీసుకున్న తర్వాతే వారి శాఖల ఉన్నతాధికారులకు చెప్పాలని తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో ప్రజా వినతుల పరిష్కార వేదిక లో హాజరై వినతులను స్వీకరించారు. కలెక్టర్తో పాటు జెసి సేతుమాధవన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 140 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంబంధించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 94 వినతులు ఉన్నాయి. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ సోమవరం ఎటువంటి ఇతర సమావేశాలు కానీ, కార్యక్రమాలు కానీ నిర్వహించవద్దని, వినతుల స్వీకరణ కు మాత్రమే హాజరు కావాలని తెలిపారు. . అనుమతి లేకుండా హాజరైన అధికారులకు మెమోలు జారీ చేయాలని డిఆర్ఒకు సూచించారు. అలాగే ఫైల్స్ తీసుకొని తన ఛాంబర్ లో అధికారులు కూర్చోవద్దని, తాను పిలిచిన వారే , పిలిచినప్పుడే రావాలని, అనవసరంగా సమయం వృధా చేసుకోవద్దని తెలిపారు. ప్రజా వినతుల పరిష్కారం కోసం అందిన దరఖాస్తులను చిత్త శుద్ధితో పరిష్కరించాలని తెలిపారు.

ధాన్యం ఇచ్చిన 48 గంటల్లోనే చెల్లింపులు

- మద్దతుధర కంటే తక్కువకు విక్రయించొద్దు
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గజపతినగరం, గంట్యాడ, బొండపల్లి

ధాన్యం ఇచ్చిన 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలో డబ్బు జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, రైతులు ఎవరూ మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతుల అవసరాలకు అనుగుణంగా మరికొన్ని గంటలపాటు అదనంగా నిర్వహించి ఈ సమయంలో సహాయ సహకారాలు అందించాలని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు 3.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ అవసరమైతే ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచుతామని తెలిపారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్లో ధాన్యం సేకరణ చేపట్టేందుకు రైతు సేవా కేంద్రాలను 250 క్లస్టర్లుగా ఏర్పాటు చేశామని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ చెప్పారు.ధాన్యం రవాణాకు జిపిఎస్ వున్న వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు. పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మీనాకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు, డిఎస్ఒ మధుసూదనరావు, డిసిఒ రమేష్, డిసిసిబి సిఇఒ పాల్గొన్నారు.

అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో మంత్రి సమావేశమయ్యారు.పురిటి పంట పంచాయతీ చెత్త నిల్వ కేంద్రం కు అవసరమైన డంపింగ్ యార్డ్ స్థల సేకరణకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. గజపతినగరం, పురిటి పెంట గ్రామాల్లో స్థల సమస్య ఉన్న కారణంగా సేకరణ కష్టంగా ఉందని తాహశీల్దార్ బొంతు రత్నకుమార్ మంత్రికి వివరించారు. దీనిపై కలెక్టర్ తో మాట్లాడి స్థల సేకరణ జరిగేలా చర్యలు తీసుకుంటానని మంత్రి అన్నారు. గ్రామాల్లో కలుషిత తాగునీరు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యుఎస్ అధికారికి సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి జ్ఞాన దీపిక, జెడ్పిటిసి గార



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

తవుడు, మాజీ ఎంపిపిలు మక్కువ శ్రీధర్, గంట్యాడ శ్రీదేవి, రాష్ట్ర తూర్పు కాపు డైరెక్టర్ జి. గోవింద, ఎంపిడిఒ బి. కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

రూ.300 కోట్లతో తాగునీటి పథకం

ప్రజల దాహార్తిని తీర్చేందుకు గజపతినగరం నియోజకవర్గంలో రూ.300 కోట్లతో తాగునీటి పథకాన్ని నిర్మించనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు తాటిపూడి జలాశయం నీటితో ఈ పథకాన్ని నిర్మిస్తామని చెప్పారు. గంట్యాడ మండలం పెదవేమలి గ్రామంలో రూ.23.50 లక్షలతో నాలుగు రహదారులు నిర్మాణానికి, లక్కిడాం గ్రామంలో సుమారు రూ.59.5 లక్షలతో వివిధ రకాల 12 పనులకు శంకుస్థాపన చేశారు. బొండపల్లి మండలం బి.రాజేరులో రూ.43.6 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ గ్రామానికి సురక్షిత తాగునీరు అందిస్తామని, ఇంటింటికి కుళాయిలు మంజూరు చేస్తామని అన్నారు. అర్హులందరికీ పింఛన్ మంజూరు చేస్తామని, అనర్హుల పింఛన్లు తొలగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పెదవేమలిలో పదిమందికి ఒక్కొక్కరికీ రూ.2 లక్షలు చొప్పున పిఎంఇజిపి కింద డెయిరీ యూనిట్ల మంజూరు పత్రాలను మంత్రి పంపిణీ చేశారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు పంచాయతీరాజ్ ఎస్ఇ ఎం.శ్రీనివాస్, ఆయా మండలాల తాహశీల్దార్లు, ఎంపిడిఒలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



జిసిసి సబ్బుల తయారీ యూనిట్ను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రావణ్కుమార్

జిసిసి బలోపేతానికి చర్యలు

కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి
జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం జీసిసిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, దీని బలోపేతానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఆ సంస్థ రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. నగరంలోని తోటపాలెంలోగల సబ్బుల తయారీ యూనిట్ను ఆయన సోమవారం పరిశీలించారు ఈ సందర్భంగా సబ్బుల తయారీ, వాటి నాణ్యత తదితర విషయాలపై ఆరా తీశారు ఈ సందర్భంగా మామూలు చేతి యంత్రాలతోనే సబ్బులు తయారు చేస్తున్నామని. దాని ద్వారా ఉత్పత్తి నెమ్మదిగా ఉంటుందని సిబ్బంది చెప్పగా ఆటోమేటిక్ యంత్రాలు ఏర్పాటుకు ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు చేపడతామని అన్నారు. ప్రైవేటు సరుకులు మాదిరిగా డిసిసి సరుకులు జనాలను ఆకర్షించే విధంగా నాణ్యతతో తయారు చేస్తామని చెప్పారు. సబ్బుల మోడల్ పాతవిగా కనిపిస్తున్నాయని వాటి రూపును మార్చి కార్పొరేట్ మాదిరిగా వీటిని కూడా తయారు చేస్తామని చెప్పారు ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సాలు కప్పి సన్మానించారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని వారు శ్రావణ్ కుమార్ కు వినతి పత్రం అందించగా ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిసిసి సిబ్బంది సువర్ణ రాజు తదితరులు పాల్గొన్నారు




క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న విద్యుత్తుశాఖ డైరెక్టర్ విజయలలిత

విద్యుత్శాఖ ఉద్యోగుల క్రీడా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర స్థాయి విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలు సోమవారం స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను విద్యుత్ శాఖ డైరెక్టర్ వి.విజయలలిత ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి విద్యుత్ ఉద్యోగులు హాజరయ్యారు. అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్ విభాగంలో పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన విజయలలిత మాట్లాడుతూ ఉద్యోగంలో బిజీగా ఉన్న ఉద్యోగులకు మానసిక ఆరోగ్యం కలిగించేందుకు క్రీడలు ఎంతో దోహద పడతాయని అన్నారు. గౌరవ అతిథి ఆపరేషన్ సర్కిల్ డైరెక్టర్ రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగంతో పాటు ఆరోగ్యం కూడా కాపాడుకోవాల్సిన అవసరం మనకు ఉందన్నారు. క్రీడలు ఆడటం ద్వారా పట్టుదల, క్రమశిక్షణ ,పోటీ తత్వం ఏర్పడు తుందన్నారు. పోటీల్లో బాగా ఆడి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. విద్యుత్ శాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ నిరంతరం ఉద్యోగ బాధ్యతలతో ఉండే ఉద్యోగులకు మానసిక,శారీరక ఉల్లాసం కోసం క్రీడలు దోహదం చేస్తాయన్నారు. అనంతరం అథ్లెటిక్స్,టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. అనంతరం క్రీడలు పరుగు పందెం,హై జంప్,లాంగ్ జంప్, డిస్కస్ త్రో వంటి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాన్స్కో ఎస్ఇ బాలాజీ, ఇఇ పి.త్రినాధరావు, ట్రాన్స్కో క్రీడాదికారి కుమార్ వడివేలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



పరుగు పోటీలో పాల్గొన్న ఉద్యోగులు

ప్రారంభించని ఎన్ఆర్ఇజిఎస్ పనులు నేటితో రద్దు

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఉపాధి హామీ కింద మంజూరైన సిసి రోడ్లు, ఇతర పనులను ప్రారంభించేందుకు ఈ నెల 26 వరకు మాత్రమే గడువు ఉందని, అప్పటికీ ప్రారంభించకపోతే పనులను రద్దు చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిల్లాలో ఇంకా సుమారు 283 పనులను ప్రారంభించాల్సి ఉందని, వీటిని మంగళవారం నాటికి ప్రారంభించకపోతే రద్దు చేస్తామని ప్రకటించారు. ఎంపిడిఒలు, ఇఒపిఆర్డిలు, మెడికల్ ఆఫీసర్లు, ఆర్డబ్ల్యుఎస్ ఎఇలతో కలెక్టర్ తమ ఛాంబర్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.180 కోట్ల విలువైన సిసి రోడ్లు, ఇతర పనులను గత నెల 24న మంజూరు చేసినప్పటికీ, నేటికీ పూర్తిస్థాయిలో పనులను ప్రారంభించకపోవడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ 283 పనులు పెండింగ్లో ఉన్నాయని, వీటిని తక్షణమే ప్రారంభించాలన్నారు పనులు ఎక్కువ పెండింగ్ ఉన్న మండలాల ఎంపిడిఒలను నిలదీశారు. సుమారు రూ.180 కోట్ల విలువైన పనులను మంజూరు చేయగా, ఇప్పటివరకు కేవలం రూ.89 కోట్లు బిల్లులు మాత్రమే అప్లోడ్ చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వంగర, పూసపాటిరేగ, కొత్తవలస, రాజాం, రామభద్రాపురం, భోగాపురం, బాడంగి తదితర కొన్ని మండలాలు ఉపాధి పనుల నిర్వహణలో బాగా వెనుకబడి ఉండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 805 పశు శాలలు మంజూరు కాగా, 540 మాత్రమే పూర్తి అయ్యాయని, మిగిలినవాటిపనులను ప్రారంభించాలని ఆదేశించారు. డ్వామా ఇన్ఛార్జ్ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, జెడ్పి సిఇఒ బివి సత్యనారాయణ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్, ఇన్ఛార్జ్ డిఎంఅండ్హెచ్ఒ డాక్టర్ రాణి, పిఆర్ ఎస్ఇ ఎం.శ్రీనివాస్, సచివాలయాల ఇన్ఛార్జ్ నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

వినతులకు తక్షణ పరిష్కారం : ఎస్పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను, వినతులను తక్షణం పరిష్కరించాలని ఎస్పి వకుల్ జిందాల్ పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులతో మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని,చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా 35 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎఎస్పి పి.సౌమ్యలత, ఎస్బి సిఐలు ఎవి లీలారావు, ఆర్విఆర్కె చౌదరి, డిసిఆర్బి ఎస్ఐ రాజేష్ మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పి, ఎఎస్పి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

కలెక్టరేట్ వద్ద ఎపి రైతు సంఘం ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో వరిపంట కోత దశలో కత్తెర, కొమ్ము పురుగు వరి కంకులను కత్తిరించేయడం వల్ల నష్ట పోయిన రైతులను గుర్తించి పరిహారం ఇప్పించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కత్తెర పురుగు వరి కంకులను, ఓవులను నష్టపరుస్తోందని, అపరాలు మొక్కలను కూడా తినేస్తోందని అన్నారు. ఈ పురుగు ఆశించిన పంటకు సుమారు 90శాతం వరకు నష్టం కలిగిందన్నారు. రైతులు, కౌలుదారులు పెట్టుబడులు మొత్తం పెట్టి పంట చేతికి వచ్చే సమయానికి ఈ విధమైన తీవ్ర నష్టానికి గురయ్యారని తెలిపారు. కలెక్టర్ కలుగజేసుకొని ఈ తెగుళ్ల వల్ల నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో భీమసింగి, ఎస్సిఎస్ సుగర్ ఫాక్టరీ పరిదిలో రైతులు పండించిన చెరుకుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతుధర 9.5 రికవరీ వద్ద రూ.3100 సంకిలిలో ప్యారీ ఫాక్టరీ ద్వారా ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఫాక్టరీ యజమాన్యం ప్రైవేటుతూకం యంత్రాలు పెట్టి రైతులను దోపిడీ చేస్తోందని తెలిపారు. వెంటనే ఆ దోపిడీని అరికట్టాలని కోరారు. భీమసింగి, ఎస్సిఎస్ పరిధిలో చెరకు మొత్తం రవాణా ఛార్జీలు ఫ్యాక్టరీ లేదా ప్రభుత్వం భరించాలన్నారు. అనంతరం కలెక్టర్కు వినతి అందజేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, అధ్యక్షులు ఎన్.గోపాలం, నాయకులు లోవరపు ఆదినారాయణ, ఉపాధ్యక్షులు ఎన్.వెంకటరమణ, భీమసింగి కమిటీ అధ్యక్షులు హెచ్ వెంకటరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - జామి

దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జామిలో సోమవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేపట్టారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొని వస్త్ర దానం చేశారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోళ్ల మాట్లాడుతూ బసవేశ్వర స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. పేదల వస్త్ర దానం చేయడం గొప్ప విషయమన్నారు. వైసిపి మండల అధ్యక్షులు గొర్లె రవికుమార్, ఎంపిపి అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయు, సీనియర్ నాయకులు సంజీవి, మాజీ రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -పూసపాటిరేగ

జిల్లాలో ఆరోగ్య సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని సోమవారం జిల్లా వైద్య శాఖ అధికారి భాస్కరరావుకు తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు టిఎస్ వర్మ గ్రీవెన్స్‌లో కోరారు. ఎఎన్ఎంలకు వైద్య శాఖకు సంబంధించిన పనులు కాక ఇతర పనులు కేటాయించవద్దని రెషినేమెంట్ రద్దు చేయాలని ఫీల్డ్ సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ రద్దు చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ఏఎన్ఎంలు, ఇతరులను రెషినేమెంట్ చేయడం వల్ల జీతం ఒకచోట పని మరోచోట ఉంటున్నారు. రెషినేమెంట్ రద్దుచేసి దూర ప్రాంతాల్లో ఉన్న ఆరోగ్య సిబ్బందిని వెనక్కు పంపాలని కోరారు. జీతాలు తీసుకున్న చోటుకే పని కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది అందరికీ శతశాతం గ్రాస్ శాలరీ అమలు చేయాలని కోరారు. తమ సమస్యలపై స్పందించి పరిష్కరించాలని కోరారు.

క్రీడా దుస్తులకు రూ.50 వేలు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

డిసెంబర్ 14,15 తేదీలలో గుడివాడలో జరగబోవు రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో జిల్లా నుంచి 47 మంది స్త్రీ, పురుషులు పాల్గొంటారని వీరందరికీ క్రీడా దుస్తులకు అయ్యే ఖర్చు రూ.50వేలు అందజేస్తానని ఎమ్మెల్యే ఇందుకూరి రఘురాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరగబోవు పోటీలలో జిల్లాను ఆల్ రౌండ్ ఛాంపియన్‌గా ప్రథమ స్థానంలో నిలిపి విజయనగరం సత్తాను చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణ, ఎ.త్రినాధ్, జి.త్రినాధరావు, ఎంఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డును పరిశీలిస్తున్న ఎంపిడిఒ సూర్యనారాయణ

పాత సిసి రోడ్డు మీదే మళ్లీ..

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ గ్రామంలో రజకులు నివసిస్తున్న వీధిలో గతంలో వేసిన సీసీ రోడ్డు మీదనే మరోసారి సీసీ రోడ్డు వేస్తున్నారు. ఇక్కడ 80 మీటర్ల పొడవు గల సీసీ రోడ్డు నిర్మాణానికి పల్లెపండగలో భాగంగా రూ.3లక్షలు మంజూరయ్యాయి. అయితే గత టిడిపి ప్రభుత్వంలోనే ఇక్కడ సీసీ రోడ్డు వేశారు. మరోసారి ఉన్న సీసీ రోడ్డుమీదే మళ్లీ రోడ్డు వేసి బిల్లులు పెట్టుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రోడ్డు పనులను ఎంపిడిఒ సూర్యనారాయణ సోమవారం పరిశీలించారు.

రైతు వద్దకే వెళ్లి ధాన్యం కొనుగోలు

వేపాడ: రైతు సమాచారమిస్తే రైతు కల్లం వద్దకే వెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తామని ఎఒ యశ్వంత్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో ఇంతవరకు 1755 హెక్టార్లలో వరి కోతలు పూర్తయ్యాయన్నారు. రైతులు నూర్పు వేసిన తర్వాత రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందికి తెలియజేస్తే రైతు వద్దకు వెళ్లి వివరాలు సేకరించి రైతు పండించే ధాన్యాన్ని కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ విషయాన్ని మండలంలో ఉన్న రైతులందరూ తెలుసుకొని తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

పాఠశాలల పరిశీలన

కొత్తవలస: జిల్లా అకడమిక్ మోనటరింగ్ టీమ్ మండలంలోని గొల్లపేట, సీతంపేట ప్రాథమిక పాఠశాలలను, కెజిబివి పాఠశాలను సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా విద్యార్థుల అకడమిక్ సామర్థ్యాలు, విద్యా ప్రమాణాల స్థాయి, ఉపాధ్యాయుల భోధనా నైపుణ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు భోధనా నైపుణ్యాలను అభివృద్ధి పర్చుకొనుటకు తీసుకోవల్సిన సోపానాలను కమిటీ సభ్యులు తెలియపర్చారు. జిల్లా సమగ్రశిక్షా సెక్టోరియల్ అధికారులు, డైట్ లెక్చరర్స్, జిల్లా ఉప విద్యా శాఖ అధికారులు, విషయ నిపుణులతో కూడిన ఈ కమిటీ అన్ని సౌకర్యాలపై ఆరా తీసింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వి.ఆదినారాయణ, ఎస్ఎస్ఎ సిఎంఒ వై.సుబ్రమణ్యం, డైట్ లెక్చరర్ వి.గోపిచంద్, ఎస్ఎస్ఎ ఎపిఒ యస్.సూర్యారావు, ఎస్ఒ, ఎంఇఒ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్ వద్ద వాహన తనిఖీలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక మిమ్స్ హస్పటిల్ వద్ద ఎస్ఐ బి. గణేష్ సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్సు, ఇన్సూరెన్స్ పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న వారి పైన కేసు నమోదు చేస్తున్నామన్నారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని వాహనానికి సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలని కోరారు.

ప్రార్థనా మందిరం ప్రారంభం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని పేరాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంను (బ్యులా మినిస్ట్రీస్) సోమవారం రెవరెండ్ పాస్టర్ విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు దయ ప్రేమ కరుణ కలిగిన దేవుడన్నారు. ప్రజలంతా ప్రేమ దయ కరుణ కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రెవ బ్యూలా విజయ్ కుమార్, రెవరెండు జె డానియల్, పాస్టర్ శామ్యూల్ రాజేష్ పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటర్నేషనల్ డే ఫర్ ది ఎలిమినేషన్ ఆఫ్ వైలెన్స్ ఎగైనెస్ట్ ఉమెన్ సందర్భంగా స్థానిక మహారాజా ఫార్మసీ కళాశాలలో విద్యార్థినులకు టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మురళీ చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళల భద్రత, వారికి న్యాయం కల్పించడంలో పోలీసు వ్యవస్థ పాత్రను వివరి ంచారు. అత్యాచారాలు, నేరాల నివారణ, మహిళల భద్రతకు సంబంధించిన వివిధ చట్టాలను గురించి వివరిం చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

23 వరకు ప్రచార కార్యక్రమాలు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో లింగ అసమానత్వ సమస్యలను ఎదుర్కోడానికి దేశమంతటా లింగ వివక్ష కు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమాలను రూపొందించినట్లు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అమ్మాయిలను, అబ్బాయిలను అన్ని రకాలుగా సమానంగా చూస్తామని, బాలికలను ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం ప్రోత్సహిస్తామని, బాల్య వివాహాలను అరికడతామని , మహిళలకు సమాన పనికి సమాన వేతనం అందేలా చూస్తామని, బాలికలకు, మహిళలకు హింస లేని జీవితాన్ని అందించడానికి కృషి చేస్తామని సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సాధికారతను పొందడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలో ఈ నెల 25 నుండి డిసెంబర్ 23 వరకు పలు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో లైన్ డిపార్టుమెంటు అధికారులంతా భాగస్వాములు కావాలని తెలిపారు.

ప్రతి ధాన్యపు గింజా కొంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బొబ్బిలి రూరల్

ప్రభుత్వం రైతు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. సోమవారం గోపాలరాయుడు పేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, రైతుల ఖాతాల్లో డబ్బులు త్వరితగతిన జమ చేస్తామని తెలిపారు. క్వింటా ధాన్యం రూ.2300 చెల్లిస్తున్నామని, తేమశాతం 17గా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, టిడిపి మండల అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ, గోపాలరాయుడుపేట నాయకులు రెడ్డి మోహన్, వెలగవలస సర్పంచ్ తమ్మిరెడ్డి సత్యంనాయుడు, డిబ్బగుడివలస ఎంపిటిసి వెన్నెల నాగరాజు, నాయకులు కునుకు శివ, భాస్కరరావు, మత్స రమణ, పాల్గొన్నారు.

డెంకాడ: ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కనీస మద్దతు ధరకు కొంటుందని రైతులెవరూ దళారులకు అమ్ముకోవద్దని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. మండలంలోని చొల్లంగిపేట గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ముందుగానే సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కోసం సంబంధిత రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు నియమత, ఎ.నాగభూషణరావు, తహశీల్దార్ వి.పద్మావతి ఎఒ నిర్మల, సర్పంచులు కోరాడ కనకరాజు, అల్లాడ శివకృష్ణ, ఎంపిటిసి గుడివాడ కిరణ్ కుమార్, జనసేన నాయకులు పైల శంకర్, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సభ్యులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వంగర: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని చీపురుపల్లి అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.వి అరుణశ్రీ అన్నారు. మండలంలోని శివ్వాంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ముందుగా ధాన్యం కొనుగోలు సిబ్బంది, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ రకం ధాన్యం 100 కేజీలకు రూ.2,300, 40 కేజీలకు రూ.920, 80 కేజీలకి రూ.1840 చెల్లిస్తామని ప్రకటించారు. ఏ గ్రేడ్ రకం అదే కేజీలకు రూ.2320, రూ.928, రూ.1856 చెల్లిస్తామన్నారు. రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుంది అన్నారు. ఎంపిపి ఉత్తర వెల్లి సురేష్ ముఖర్జీ, ఎఒ కన్నబాబు, సిఇఒ ఉమామహేశ్వరరావు, నాయకులు బొక్కేల వెంకట అప్పలనాయుడు, బొక్కేల సత్యంనాయుడు, పిన్నింటి మోహనరావు ధాన్యం కొనుగోలు సిబ్బంది, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.


బొబ్బిలి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

గుర్ల : కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని పనిచేస్తుందని టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి, విశాఖ డైరీ బోర్డు డైరెక్టర్ వెన్నె సన్యాసినాయుడు అన్నారు. సోమవారం మండలంలో తెట్టింగి, కెల్ల, జమ్ముపేట, సహకార సొసైటీలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కోసం ఈ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందన్నారు. రైతులు ధాన్యాన్ని తమకు అందుబాటులో ఉన్న మిల్లుకు అమ్ముకోవచ్చు అన్నారు. నాబార్డ్ మాజీ డైరెక్టర్ కెవి సూర్యనారాయణ రాజు, విమల రాణి, గోవిందు, రామునాయుడు సొసైటీ ప్రతినిధులు, మండల టిడిపి నాయకులు అప్పల నాయుడు, సొసైటీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భోగాపురం: మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే లోకం మాధవి సోమవారం ప్రారంభించారు. రైతులు దళారుల బారిన పడకుండా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ హరికృష్ణ, తహశీల్దార్ ఎం సురేష్, ఎంపిడిఒ కిరణ్ కుమార్, సిఎస్‌డిటి మురళి, జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్, పల్ల రాంబాబు, వందనాల రమణ, బొల్లు త్రినాథ్, మాత నవీన్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతి

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని భోగాపురంలోని ఎస్‌సి, బిసి కాలనీకి చెందిన పలువురు మహిళలు ఎమ్మెల్యే లోకం మాధవిని కోరారు. గత ప్రభుత్వం హయాంలో సుందరపేట వెళ్లే రహదారిలో జగనన్న కాలనీలో తమకు స్థలాలు మంజూరు చేసినప్పటికీ కోర్టు వివాదం కారణంగా నిలిచిపోయాయని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కోర్టు వివాదంలో ఉండిపోయిన స్థలాలపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందన్నారు. అందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని ఆమె మహిళలకు వివరించారు.

మరోసారి బయట పడిన విభేదాలు

ఎమ్మెల్యే పాల్గొన్న కార్యక్రమాలను బహిష్కరించిన తమ్ముళ్లు

ప్రజాశక్తి - డెంకాడ, భోగాపురం

నెల్లిమర్ల నియోజకవర్గంలోని కూటమి నాయకుల్లో మరోసారి విభేదాలు బయటపడ్డాయి. ప్రభుత్వ పరంగా డెంకాడ, పూసపాటిరేగ మండలాల్లో జరిగిన రెండు అధికార కార్యక్రమాలకు టిడిపి నాయకులు హాజరకాలేదు. మండలస్థాయి నాయకులతో పాటు కార్యకర్తలు కూడా రాకపోవడం విశేషం. అయితే ఎమెల్యే కార్యాలయం నుంచి గతంలో సమాచారం వచ్చేదని ఇప్పుడు ఈ కార్యక్రమానికి ఎటువంటి సమాచారం రాకపోవడంతోనే టిడిపి నేతలు బాయ్‌కాట్ చేసినట్లు ఆపార్టీ నేతలే చెబుతున్నారు.

డెంకాడ మండలంలోని చొల్లంగిపేట, భోగాపురం మండల కేంద్రంలో రబీ సీజన్‌కి సంబంధందించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాన్ని అధికారులు సోమవారం ఏర్పాటు చేశారు. అయితే ఎమ్మెల్యే లోకం మాధవితో పాటు మార్క్‌ఫెడ్ చైర్మన్‌కు ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. దీంతో ఎమ్మెల్యే ఈ రెండు కార్యక్రమాలకు హాజరై ప్రారంభోత్సవం చేశారు. కాని మార్క్‌ఫెడ్ చైర్మన్‌తో పాటు ఆ పార్టీకి చెందిన మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు ఒక్కరు కూడా హాజరుకాలేదు. ఫలితంగా ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. మరోసారి కూటమీ నేతల్లో విభేదాలు రాజుకున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.

పల్లె పండుగ పనులు 'పంచాయితీ' కంచెకు చేరినట్టే!

ఇటీవలి నెల్లిమర్ల కౌన్సిల్ సమావేశంలో ఇద్దరి మధ్య విభేదాలు బయటడపడడంతో అధిష్టానం వెంటనే స్పందించింది. అసెంబ్లీ సమావేశాలకు మందు ఇరు పార్టీలకు చెందిన పెద్దలు ఇద్దరిని కూర్చోపెట్టి పంచాయితీ నిర్వహించారు. అప్పుడే ఒక్కటయ్యారని ఇక విభేదాలు ఉండవని అంతా ఊహించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిశాక పల్లె పండగ పనులకు సంబంధించి ఎవరెవరకి ఎన్ని పనులు కేటాయించాలనేదానిపై ఇద్దరు కూర్చొని తేల్చుకుంటారని అధికారులందరు అనుకున్నారు. తాజాగా జరిగిన సంఘటనతో మళ్ళీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పల్లెపండగ పనులు మళ్ళీ ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అమరావతిలో జరిగిన పంచాయితీతో కూటమి నేతలంతా ఒక్కటవుతారని ఇరుపార్టీ పెద్దలంతా ఊహించారు. కాని వీరి మధ్య విభేదాలు ఇంకా కొనసాగుతున్నాయని ఈ సంఘటనతో బయటపండింది. మళ్ళీ వీరి పంచాయితీ మరోసారి రాజధానికి వెళ్ళే పరిస్థితులు కనబడుతున్నాయి.

జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి - తెర్లాం

మండల కేంద్రంలో ఎపిఎం టి.రాము ఆధ్వర్యంలో సోమవారం జాతీయ జెండర్ ఆధారిత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమాజంలో చిన్న పిల్లలు, స్త్రీల మీద జరుగుతున్న దాడులకు, హింసకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కలిగించడానికి జాతీయ స్థాయిలో ప్రచారం చేస్తున్నారని అందులో భాగంగా ఈ నెల 25నుంచి డిసెంబర్ 23 వరకు పలు దఫాలుగా అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు గుండా రామ మందిరం వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హేమంత్ కుమార్, ఎంపిడిఒ ఆర్ రాంబాబు, ఎంఇఒ త్రినాధ రావు, ఎస్ఐ సాగర్ బాబు, వెలుగు సీసీలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రంలో జెండర్ ఆధారిత హింసతకు వ్యతిరేకంగా సోమవారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ పిల్లలు, మహిళలపై జరుగుతున్న దాడులను వ్యతిరేకంగించాలన్నారు. ఎపిఎం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెచడ్ కానిస్టేబుల్, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

లింగవివక్షను విడనాడాలి: ఎంపిడిఒ

బొబ్బిలిరూరల్: ప్రస్తుత సమాజంలో లింగవివక్షతను విడనాడాలని ఎంపిడిఒ రవికుమార్ అన్నారు. సోమవారం బొబ్బిలి మండల సమాఖ్య ఆధ్వర్యంలో జాతీయ లింగవివక్ష కార్యాచరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ పురుష బేధం లేకుండా సమాజంలో ప్రతి ఒక్కరినీ ఒకేలా చూడాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, గృహహింస నిర్మూలన చేయాలన్నారు. ఆడపిల్లల చదువుపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపియం పి.భాగ్యలక్ష్మి, ఎపిఒ లక్ష్మిపతిరాజు, సిసిలు స్వయం సహాయక సంఘ మహిళలు పాల్గొన్నారు.


డెంకాడ: ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి, అధికారులు

డెంకాడ: మండలంలోని చొల్లంగిపేటలో జెండర్ క్యాంపెయిన్ 3.0 కార్యక్రమాన్ని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి మహిళల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు, పిల్లలు బాల్యవివాహాలు గృహ హింస వంటి అన్యాయాలకు లోనుకాకూడదన్నారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడానికి అవసరమైన హెల్ప్ లైన్ నెంబర్లు గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, ఎపిఎం శ్రీనివాస్, జనసేన మండల కోఆర్డినేటర్ పైల్ శంకర్రావు, ఎంపిటిసి కిరణ్, సర్పంచులు కనకరాజు, శివకృష్ణ, జనసేన నాయకులు రమేష్, చింతపల్లి రామ్మూర్తి, సీసీలు మంజుశ్రీ, విఒఎలు స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: లింగ ఆదారిత హింస నివారణకు అన్ని వర్గాలు సహకరించాలని డిఆర్‌డిఎ ఎపిడి కె.సావిత్రి పిలునిచ్చారు. సోమవారం జెండర్ వివక్ష వ్యతిరేకంగా జాతీయ స్థాయి ప్రచారంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ స్థాయి కార్యాచరణ ప్రణాళిక ఈ నెల 25 నుంచి వచ్చే నెల 23 వరకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు, ఏరియా కో ఆర్డినేటర్ బి. బంగారమ్మ, హెచ్‌డి ఎపిఎం కె.గీత, స్త్రీ నిధి మేనేజర్ బి. ఎర్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న సత్యనారాయణ

సొంత నిధులతో గ్రామాభివృద్ధికి శ్రీకారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని కొండవెలగాడలో టిడిపి నాయకులు దంతులూరి అజయ్‌బాబు, మొయిద సత్యనారాయణ సొంత నిధులతో గ్రామాభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సోమవారం రూ.20వేలతో కొత్త వీధి లైట్లు, మురుగు కాలువలు పరి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా గ్రామంలో వీధి లైట్లు వెలగక ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. మురుగు కాలువలు నిండిపోయి దుర్గంధంగా ఉన్నాయని, దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో తమ సొంత నిధులతో కొత్త లైట్లు వేసి, మురుగు కాలువల్లో పూడికలను తీయించామని చెప్పారు

చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని కొండవెలగాడ సీతమ్మ చెరువు ఆక్రమణ పై చర్యలు తీసుకోవాలని జై భీంరావు భారత్ పార్టీ నాయకులు టొంపల నరసయ్య డిమాండ్ చేశారు. సోమవారం జై భీం రావు భారత్ పార్టీ నాయకులు సీతమ్మ చెరువు ఆక్రమణ పై తహశీల్దార్ సుదర్శనరావుకు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ కొండవెలగాడ రెవెన్యూ పరిధిలో కొండ వెలగాడ నుంచి రోళ్లవాక వెళ్లే రహదారిలో కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు, మిత్ర రియల్ ఎస్టేట్ యాజమాన్యం కొంత భూమిని కనుగోలు చేసి మరికొంత ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుందన్నారు. సర్వే నెంబర్ 261-4లో 62సెంట్లు, సర్వే నెంబర్ 262-5లో 2.88ఎకరాలు, సర్వే 267-1లో 30సెంట్లు భూమి రియల్ ఎస్టేట్ యజమాని కనుగొలు చేయగా పట్టాదారుగా ఎలా నమోదు జరిగిందని ప్రశ్నించారు. కాగా పంచాయతీ అధికార్లు 20ఎకరాలు మాత్రమే రియల్ ఎస్టేట్ యజమానికి అనుమతి ఇచ్చినట్లు సమాచారం ఉండగా 29 ఎకరాలు భూమి రియల్ ఎస్టేట్ యజమానికి ఎలా వచ్చిందని 9 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ భూ ఆక్రమణ పై సమగ్ర దర్యాప్తు చేసి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో జై భీం రావు భారత్ పార్టీ నాయకులు ఎం. వెంకట నాయుడు,పి. రాము,సిహెచ్ అరుణ్ కుమార్, పి. జ్యోతి, కనిగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న జైభీంరావు పార్టీ నాయకులు

చిరు ధాన్యాల ఉత్పత్తిదారుల సంఘ సమావేశం

ప్రజాశక్తి - కొత్తవలస

మహిళా సాధికారతకు నిదర్శనంగా ఆరోగ్య చిరుధాన్యాల ఉత్పత్తిదారుల సంఘం నిలబడిందని నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి టి. నాగార్జున అభినందించారు. గొల్లలపాలెం గ్రామంలో జరిగిన ఆరోగ్య చిరుధాన్యాల ఉత్పత్తిదారుల సంఘం జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆరోగ్య ఎఫ్‌పిఒ ద్వారా తయారు చేసిన భారత చిరుధాన్యాలు సమైక్య సహకారంతో తయారు చేసిన ఇంటింటా చిరుధాన్యాలు ఊరంతా ఆరోగ్యం క్యాంపెయిన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వ్యవసాయ పరిశోధన డైరెక్టర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టిఎస్ఎస్ పాత్ర మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా చిరుధాన్యాలు పండించే రైతులకు ఎంతో ప్రోత్సహిస్తున్న సభల సంస్థ ప్రతినిధులను అభినందించాలన్నారు. ఎపి జీవవైవిధ్య మండలి మాజీ మెంబర్ సెక్రెటరీ డాక్టర్ నల్లి మోహన్, కర్రి జోగు నాయుడు, శాస్త్రవేత్తలు డాక్టర్ తేజేశ్వరరావు, డాక్టర్ అనురాధ, డాక్టర్ త్రివేణి, గొల్లలపాలెం సర్పంచ్ మంగమ్మ, ఆరోగ్య ఎఫ్‌పిఒ సరస్వతి, జి.ఉషారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాబార్డు జిల్లా అధికారి నాగార్జున

వేసవి నాటికి బోర్ల మరమ్మతులు పూర్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వచ్చే వేసవికాలం కల్లా ఎక్కడా బోర్లు మరమ్మతు లేకుండా చూస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఇందుకోసం ఇప్పటినుంచి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి బోర్ల మరమ్మతులను చేపడుతున్నామన్నారు. సచివాలయాల వారీగా మరమ్మతులకు గురైన బోరింగుల వివరాలను సేకరించా మన్నారు. ప్రాధాన్యతా క్రమంలో ఒక్కొక్క డివిజన్లో మరమ్మతులకు గురైన బోర్లను సరి చేస్తున్నామన్నారు. బోరింగుల చుట్టూ పరిశుభ్ర వాతావరణం నెలకొనే విధంగా చూడాలన్నారు.

పాన్, గుట్కా వినియోగంపై దాడులు

ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే పాన్,గుట్కా, పాన్ మసాలా వంటివి వినియోగించడం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని ఆయా సచివాలయాల పరిధిలో ప్రజలకు కార్యదర్శులు అవగాహన కల్పిస్తున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వలన కలిగే దుష్ప్రభావాల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. టిఫిన్ దుకాణాలు, పాన్ షాప్ లు, కిరాణా షాపులలో ప్లాస్టిక్ కవర్లు వినియోగాన్ని పూర్తిగా తగ్గించుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు.

మొండి బకాయిలపై రెవెన్యూ సిబ్బంది కొరడా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మొండి బకాయిల వసూళ్లకు విజయనగరం నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం కొరడా ఝుళిపిస్తోంది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులు మొండి బకాయిదారులను గుర్తించి వారి వద్దకు వెళ్లి ఆస్తి పన్ను బకాయిలను రాబడుతున్నారు. ఏ ఒక్క ఆస్తిదారుడు పన్ను బకాయి లేకుండా చేయాలన్నదే తమ ధ్యేయమని కమిషనర్ ఈ సందర్భంగా చెప్పారు. ఆస్తి, ఖాళీ స్థలాలు, కులాయి పన్నులు, ట్రేడ్ లైసెన్సులను బకాయి లేకుండా చెల్లిస్తే ప్రజా అవసరాలను మరిన్ని తీర్చగలుగుతామని అన్నారు. నగర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విజయనగరంకోట : ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జోనల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొరకు, ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణకు ఆ యూనియన్ నాయకులు వినతినిచ్చారుఉ. అవుట్ సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ సెక్రటరీ ఎ.అశోక్ మాట్లాడుతూ, ఆర్‌టిసిలో 7800 మంది కార్మికులు కాంట్రాక్ట్ వ్యవస్థ థర్డ్ పార్టీ విధానంలో పని చేస్తున్నారని, దీనివల్ల చాలావరకు నష్టపోతున్నారని తెలిపారు. థర్డ్‌పార్టీ విధానాన్ని రద్దు చేసి, నేరుగా సంస్థ నుంచి జీతం వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జోనల్ చైర్మన్‌కు ఇయు వినతి

1/2019 సర్కులర్ అమలు చేయాలని కోరుతూ జోనల్ చైర్మన్ దొన్నుదొరకు ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వినతినిచ్చారు. రాజాం, చీపురుపల్లి/విశాఖ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో 30 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన వారికి ప్రమోషన్ లేదా ప్రత్యామ్నాయం కోరారు. విజయనగరం డిపో కమిటీ ఇయు నాయకులు చవక శ్రీనివాస్ రావు, పైడి శ్రీనివాసరావు, డివి రాజు, కోట్ల నారాయణ స్వామి, రాజారావు, తదితరులు ఉన్నారు.

మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఉద్యమించండి

ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాడాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ పిలుపునిచ్చారు. సోమవారం ఎస్ఎస్‌జె కళాశాలలో జరిగిన హింస వ్యతిరేక దినం సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి నవంబర్ 25న మహిళలపై హింసను వ్యతిరేకించే అంతర్జాతీయ దినోత్సవంగా ప్రకటించి ందన్నారు. ఈ సందర్భంగా నవంబర్ 25 నుండి మానవహక్కుల దినోత్సవమైన డిసెంబర్ 10 వరకు అంతర్జాతీయ క్యాంపెయిన్‌కి బ్రిటిష్, ఐరిష్ ట్రేడ్ యూనియన్ పిలుపునిచ్చిందన్నారు. ఈ క్యాంపెయిన్‌లో అంతర్జాతీయంగా మహిళలు, బాలికల హక్కులుబీ వివిధ దేశాల ప్రభుత్వాలతో సంప్రదింపులు మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు తీసుకోవలసిన చట్టపర బాధ్యతలు.. వంటి వాటి గురించి ఈ సదస్సులో తెలియ జేశారు. ఇలాంటి అంతర్జాతీయ దినోత్సవాలు ఎన్ని జరుగుతున్నా, మహిళల పట్ల అణిచివేత, పెరుగుతున్న హింస ఆందోళనకు గురిచేస్తుందని అన్నారు. లైంగిక దాడులు, అత్యాచారాలు, అక్రమ రవాణా, బాల్యవ వివాహాలు ఇలా అనేక రాలుగా మహిళలు హింసకు గురవుతు న్నారన్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో మహిళల పైన, పిల్లల పైన, విద్యార్థినుల పైన అత్యాచారాలు, హత్యలు పెరిగాయని, వీటి నివారణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఈనేపథ్యంలో మహిళలంతా ఐక్యంగా ఉద్య మించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి వి. లక్ష్మీ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు

విద్యుత్ వైరు తగిలి వెల్డింగ్ హెల్పర్ మృతి

రేగిడి: మండలంలోని పనసలవలస గ్రామంలో సోమవారం విద్యుత్ వైర్ తగిలి విజయనగరం మండలం, జమ్ము నారాయణపురం గ్రామానికి చెందిన వెల్డింగ్ హెల్పర్ యడ్ల మహేష్ (52) మృతి చెందాడు. ఉపాధి కోసం పనసలవలస వచ్చి ఒక ఇంటి యజమాని దాబా ఇంటిపై రేకుల షెడ్డు ఏర్పాటుకు వెల్డింగు చేస్తూ విద్యుత్ వైరు తగిలి పై అంతస్థ నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎఎస్ఐ రాజారావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రాజాం ప్రాంతీ య ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతునికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

డెంకాడ: మండలంలోని చింతలవలస సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భోగాపురం మండలం గూడెపువలసకు చెందిన బోర రవికుమార్(25) మృతి చెందాడు. రవికుమార్ కాకినాడలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పెద్దనాన్న మనవరాలుకి శారీ ఫంక్షన్‌కు ఆదివారం సాయంత్రం కాకినాడ నుంచి వచ్చాడు. సోమవారం విజయనగరం పనిమీద వెళ్లి తిరిగి వస్తుండగా బెటాలియన్ వద్ద ముందు వెళ్తున్న టాటా ఏసీ వాహనం సడన్‌గా మలుపు తిప్పడంతో వెనుక నుంచి వస్తున్న రవికుమార్ ద్విచక్ర వాహనంతో నేరుగా వాహనాన్ని ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలిం చగా అక్కడ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురిపై బైండోవర్

వంగర: మండలంలో సారా అమ్మిన నలుగురు వ్యక్తులపైన బైండోవర్ కేసులు నమోదు చేశామని రాజాం ఎక్సైజ్ సిఐ ఆర్ జై భీమ్ తెలి పారు. సంగాం, రుషింగి గ్రామాలకు చెందిన ఇద్దరిపైన, జె.కె గుమ్మడికి చెందిన ఇద్దరు వ్యక్తులుపైన బైండోవర్ కేసుల నమోదు చేశారు. సోమవారం తహశీల్దార్ డి ధర్మరాజు ఎదుట వారిని హాజరు పరిచినట్లు తెలిపారు. సిఐ మాట్లాడుతూ గతంలో ఈ నలుగురు వ్యక్తులు సారా అమ్మేవారని వీరికి ఎన్నిసార్లు కౌన్సిలింగ్ ఇచ్చిన మార్పు రాలేదని అన్నారు. నాటు సారా తయారు చేసి విక్రయించిన వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సారా, అక్రమ మద్యం రవాణా, బెల్ట్ షాపులు వంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించిన వారిపట్ల కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జి మాన్యాలు, సిబ్బంది పాల్గొన్నారు.